
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 5 ఏప్రిల్ 2024





అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

మల్లాపూర్, ఏప్రిల్4: ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై కిరణ్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండలంలోని సాతారం గ్రామ శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మున్సిపాలిటీలకు ‘అమృత్’యోగం



రరజగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో తాగునీటి వ్యవస్థ పటిష్ఠం కానుంది. కేంద్రం అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజువేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫరేషన్) 2.0 పథకం కింద ఎంపిక చేసిన పట్టణాల్లో తాగునీటి పథకాలను విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం భారీగా నిధులు ఖర్చు చేయనుంది. దీనిలో భాగంగా జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు, నూతన పైప్‌లైన్ల నిర్మాణం, కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నారు. దీంతో జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల్లో మును ముందు తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

తాగునీటికి కటకట

జిల్లాలోని మున్సిపాలిటీలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే వివిధ కారణాల వల్ల పూర్తిస్థాయిలో నీరు రావడం లేదు. దీంతో స్థానిక బోర్ల నీటిని కలిపి సరఫరా చేస్తున్నారు. అది కూడా సమయపాలన లేకుండా సరఫరా జరుగుతోంది. శివారు ప్రాంతాలు, విలీన గ్రామాలకు నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. అమృత్ 2.0 పథకం ద్వారా కేంద్రం నిధులు కేటాయించడంతో మున్సిపాలిటీలే ట్యాంకులు నిర్మించి, పైప్‌లైన్లను విస్తరించి తాగునీటి వసతి కల్పించనున్నాయి. ట్యాంకుల నిర్మాణానికి మున్సిపాలిటీలో స్థలాలను కూడా ఎంపిక చేశారు. పనులకు గత మే నెలలోనే పాలనా ఆమోదం లభించినా ప్రారంభం కాలేదు. ఈ నెలలో పనులు చేపట్టాలని ఇటీవల ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తి చేశారు. ప్రస్తుతం కాంట్రాక్టర్లకు అగ్రిమెంట్లు అందించడం పనులు జరుగుతున్నాయి. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

మున్సిపాలటీలకు ఊరట

జిల్లాలోని పలు మున్సిపాలటీలు నిధుల లేమితో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చలేకపోతున్నాయి. పలు మున్సిపాలిటీల్లో పంచాయతీలుగా ఉన్నప్పుడు నీటి సరఫరా ఏ విధంగా ఉందో ఇప్పుడూ అదే విధంగా ఉంది. ఫలితంగా వేసవిలో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. జనాభాకు అనుగుణంగా, భవిష్యత్ అవసరాల దృష్ట్యా తాగునీటి పథకాలు ఏర్పాటు కాలేదు. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం 2.0 కింద నిధులు కేటాయించడంతో ఆయా పట్టణవాసులకు తాగునీటి తిప్పలు తీరనున్నాయి.

తొలి ప్యాకేజీలో రూ.124.95 కోట్ల కేటాయింపు

అమృత్ పథకంలో తాగునీటి సరఫరా మెరుగుపర్చేందుకు జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలను మొదటి ప్యాకేజీలో ఎంపిక చేశారు. ఈ ప్యాకేజీలో రూ.124.95 కోట్లు కేటాయించారు. అమృత్ పథకం కింద జగిత్యాల మున్సిపల్‌కు రూ.35.00 కోట్లు, కోరుట్లకు రూ.37.75 కోట్లు, మెట్‌పల్లి రూ.17.60 కోట్లు, రాయికల్ రూ.13.80 కోట్లు, ధర్మపురి మున్సిపల్‌కు రూ.20.80 కోట్లు కేటాయించారు.

శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

భవిష్యత్తు జనాభాను పరిగణలోకి తీసుకుని పైపలైన్లు విస్తరించడం, రిజర్వాయర్లు నిర్మించేందుకు ఈ నిధులు ఉపయోగించుకునేలా ప్రజారోగ్యశాఖ ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి పంపించడంతో ఆమోద ముద్ర పడింది. మున్సిపాలిటీల్లో విలీన గ్రామాలు, శివారు కాలనీల్లో ఎండకాలంలో ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు చెక్ పడనుంది. వచ్చే ఏడాదిలోగా ఈ పనులన్నీ పూర్తి అయితే పట్టణాల్లో శాశ్వతంగా తాగునీటికి ఇబ్బందులు దూరం కానున్నాయి.

తాగునీటి వ్యవస్థ పటిష్టానికి చర్యలు : అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల



అమృత్ 2.0 పథకం కింద జగిత్యాల మున్సి పాలి టీలో తాగునీటి వ్యవస్థ పటిష్టానికి చర్యలు తీసుకుంటున్నాం. నూతన పైప్‌లైన్లు, ట్యాంకుల నిర్మాణం, మంచి నీటి వసతుల పునరుద్ధరణ పనులు చేయ నున్నాము. నూతన నిర్మాణాలతో కుళాయిలకు కనెక్షన్ ఇవ్వడం జరుగుతుంది. అమృత్ 2.0 పథకం కింద పనులు చేపట్టడానికి అవసరమైన టెండర్లు ఇటీ వల ఈఎన్‌సీ స్థాయిలో పూర్తయ్యాయి. భవిష్యత్ అవసరాల దృష్ట్యా అవసరమైన పనులు చేస్తాము.

మున్సిపల్ కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్‌కు జగిత్యాల ఎమ్మెల్యే లేఖ

జగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన జగిత్యాల మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విప్‌ను ధిక్కరించిన కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాకు గురువారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ లేఖ పంపారు. జగిత్యాల మున్సిపల్‌కు చెందిన 9 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ విప్‌ను ధిక్కరించారని, వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఫిర్యాదు చేశామని వివరించారు. ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంలో జాప్యం జరిగిందని తెలిపారు. జగిత్యాల పట్టణంలో హరితహారం కింద చేపట్టిన రోడ్డుకు ఇరువైపులా, ట్రాఫిక్ ఐలాండ్‌లో, రోడ్డు డివైడర్లలో, చెరువు కట్టపై చేపట్టిన చెట్ల పెంపకం ప్రస్తుత వేసవి కాలంలో సరైన నీటి వసతి లేకపోవడం వల్ల ఎండిపోతున్నాయని, వెంటనే నీటి సరాపరా చేయాలని అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర్‌లకు లేఖలను పంపారు. జగిత్యాల పట్టణంలో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో ఎంపీ చొక్కారావు హయాంలో నిర్మించిన వాణిజ్య దుకాణ సముదాయంలో వ్యాపారస్థులు అద్దెలు చెల్లించకుండా, ఇతరులకు కిరాయి ఇస్తున్నారని ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని కోరారు. చల్‌గల్ మ్యాంగో మార్కెట్‌కు ప్రస్తుత సీజన్‌లో పెద్దఎత్తున మామిడి వచ్చే అవకాశం ఉందని, కొనుగోలుదారులకు, అమ్మకందారులకు తగిన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి

- కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

జగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూళ్లలో వచ్చే విద్యా సంవత్సరంలో 6వ తరగతి అడ్మిషన్ పొందుటకు అర్హత పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అధికారులను గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత పరీక్షతో పాటు 7వ తరగతి నుంచి 10వ తరగతిలో మిగిలిపోయిన సీట్లకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీన సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించనున్నట్లు మరొక ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ పాస్ మిషన్ ద్వారా ఎరువులు అమ్మాలి



మాట్లాడుతున్న డీఏఈవో వాణి

కొడిమ్యాల, ఏప్రిల్ 4: ఎరువులను ఈ పాస్ మిషన్ ద్వారా అమ్మాలని జిల్లా వ్యవసాయ అధికారి వాణి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండలంలోని ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ డీలర్లు విత్తన, ఎరువుల, పురుగు మందుల స్టాక్ రిజిస్టర్‌లను సరిగా నిర్వహించాలన్నారు. స్టాక్ నిల్వలకు సంబంధించిన బిల్లులను తప్పకుండా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు నిర్వహించాలన్నారు. అనం తరం మండలంలోని రామకిష్టాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తాలు తప్ప లేకుండా ధాన్యాన్ని సెంట రుకు తీసుకరావాలని రైతులను కోరారు. అనంతరం వరి పొలాన్ని సందర్శించి కోత సమయంలో హార్వెస్టర్ ఆర్‌పీఎం 18-19 ఉండే విధంగా సరిగా నిర్వహిం చాలన్నారు. డీఏవో వెంట మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి. ఏఈవో మంజుల పలువురు రైతులు ఉన్నారు.

నేడు జగిత్యాలలో రైతు దీక్ష

జగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఈనెల 5వ తేదీన రైతు సత్యాగ్రహ దీక్షను నిర్వహిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్ రెడ్డిలు తెలిపారు. గురువారం పట్టణంలో విలేకరులతో వారు మాట్లాడారు. రైతుల సమస్యల పరిష్కారానికై చేపడుతున్న దీక్షకు ఎంపీ ధర్మపురి అరవింద్ హాజరుకానున్నారన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సంఘాల కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సహకార శిక్షణలో పీఏసీఎస్ కార్యదర్శికి ప్రథమ స్థానం

రాయికల్, ఏప్రిల్ 4: కాకతీయ సహకార శిక్షణలో భూపతిపూర్ పీఏసీఎస్ కార్యదర్శి ఎల్లాల చంద్రశేఖర్ రెడ్డి ప్రథమస్థానం సాధించాడు. వరంగల్‌లో డీపీసీ-సీప కోర్సులో 5 నెలల శిక్షణ అనంతరం నిర్వహించిన పరీక్షలో చంద్రశేఖర్‌రెడ్డి మొదటి స్థానం సాధించాడు. పీఏసీఎస్ కార్యదర్శిని పలువురు అభినందించారు.

పసుపు బోర్డుపై అసత్య ప్రచారం మానుకోవాలి

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి

జగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పసుపు బోర్డుపై అసత్య ప్రచారం కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మానుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణి ప్రవీణ్ అన్నారు. గురువారం పట్టణంలోని కమలా నిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం బీజేపీ పసుపు బోర్డు ఏర్పాటుకు కృషి చేసిందని, ఇందుకు అవసరమైన గెజిట్ సైతం విడుదల అయిందని వివరించారు. గత 40 సంవత్సరాలలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు జగిత్యాలకు చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. చెరుకు, మామిడి, పసుపు రైతులు నష్టాల పాలయ్యారని గుర్తు చేశారు. జగిత్యాలను గంజాయికి గేట్ వేగా మార్చారని అన్నారు. ఆడ పిల్లలు ఇంటికి రాత్రి సమయంలో క్షేమంగా తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. అనసవర విమర్శలు మానుకోవాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని పీఎఫ్ఐ జగిత్యాలలో పెంచి పోషించింది ఎవరని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో మొసలి కన్నీరు కార్చిన కాంగ్రెస్ ప్రస్తుతం రైతులకు అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అరవింద్ గత నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఏకంగా ఆరు ఆర్‌ఓబీలు, ఒకటి ఆర్‌యూబీ మంజూరు చేయించారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సైనికుని వలే అరవింద్ పనిచేస్తున్నారని కొనియాడారు. ఎంపీగా అరవింద్‌ను మరోమారు గెలిపిస్తే కేంద్ర మంత్రి అవకాశాన్ని సైతం అందిపుచ్చుకొని ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తారని వివరించారు. ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు రంగు గోపాల్, ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలు దురిశెట్టి మమత, జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దెల గంగరాజం, పుష్పరెడ్డి, తిరుపతి, ప్రశాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం

● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4: అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం ఒడ్డెర కాలనీ మాజీ సర్పంచ్ గంగాధర్‌తో పాటు 50 మంది నాయకులు గురువారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఒడ్డెర కాలనీలో మౌలిక వసతుల కల్పనతో పాటు కుల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం, అంగన్‌వాడీ, రేషన్ దుకాణాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా నిలిచి రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, నర్సయ్య, స్వామి తదిరతరులు ఉన్నారు.

గల్ఫ్ సేవా సమితి ఆర్థికసాయం

ధర్మపురి, ఏప్రిల్ 4: ధర్మపురి మండలంలోని జైనాలో ఇటీవల మృతి చెందిన కుంటాల చంద్రమౌళి కుటుంబ సభ్యులకు గురువారం జైనా-కొసునూర్‌పల్లె గల్ఫ్ సేవా సమితి తరపున రూ.30,000 ఆర్థికసాయం అందించారు. జైనా గ్రామానికి చెందిన కుంటాల చంద్రమౌళి గల్ఫ్ దేశంలో క్యాన్సర్ బారినపడి స్వగ్రామానికి వచ్చాడు. ఇటీవల ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించి ఇంటి వద్దనే మృతి చెందాడు. గల్ఫ్ సేవా సమితి సభ్యులైన చంద్రమౌళి కుటుంబ సభ్యులకు ఆ సంఘం పక్షాన ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో జైనా-కొసునూర్‌పల్లె గల్ఫ్ సేవా సమితి సభ్యులు సుంకు మదుసూధన్, కోస్న మల్లారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, షైదం మధు, ముడిమడుగు రాజేష్, సాయిని రాము, కొక్కెరకాని రాజన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

రాయికల్, ఏప్రిల్ 4: రాయికల్ మండలంలోని చెర్లకొండాపూర్, తాట్లవాయి, కిష్టంపేట, అల్యా నాయక్ తండా గ్రామాల తాజా మాజీ సర్పంచులు ఆకుల రాజ్యలక్ష్మి లక్ష్మీనారాయణ, రాగి సాగరిక శ్రీనివాస్, జాన స్వరూప గోపి, నందు నాయక్‌లతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఇంతియాజ్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు తాటిపాముల విశ్వనాథం, గౌడ సంఘం అధ్యక్షుడు బొల్లపెల్లి లింబాద్రి, కైరం స్వామి తదితరులున్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్


పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

వెల్గటూర్, ఏప్రిల్ 4: కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ కోరారు. గత నెలలో మండలంలోని వివిధ గ్రామాలలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కుష్టు వ్యాధికి సంబంధించిన ఎల్‌సీడీసీ సర్వే నిర్వహించి 94 కేసులు గుర్తించారు. కాగా గురువారం వెల్గటూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటి డీఎం అండ్ హెచ్‌వో శ్రీనివాస్ , డీపీఎంవో, లెప్రసీ ఇంచార్జి దేవ్‌సింగ్‌లు 32 మందికి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఒకరికి కుష్టు వ్యాధి సోకినట్లు గమనించి వ్యాధి నిర్ధారణ నిమిత్తం జగిత్యాల ఎంసీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి మాట్లాడుతూ శరీరంపై ఎక్కడైనా స్పర్శ లేని మచ్చలు ఉంటే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్, సీహెచ్‌వో జగన్నాథం పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 4: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో గురువారం మేడలయ్య, కేతమ్మ సహిత మలిఖార్జున స్వామి విగ్రహా ప్రతిష్ఠ కార్యక్రమం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మాణం చేసిన దేవాలయంలో వాస్తు స్థాపిత దేవత పూజ కార్యక్రమాలను నిర్వహించి మల్లిఖార్జున స్వామి విగ్రహాలను ప్రతిష్ఠాపన జరిపారు. ఈ సందర్భంగా స్థాపిత దేవతలకు అభిషేక కార్యక్రమాలు జరిపి రుద్రహోమం, ద్వాదశ కళశస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ డే వేడుకలు


కిష్టంపేటలో ప్రీ స్కూల్ డే వేడుకల్లో పాల్గొన్న మహిళలు

రాయికల్, ఏప్రిల్ 4: రాయికల్ మండలంలోని ఇటిక్యాల, కిష్టంపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ప్రీ స్కూల్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు, 0-5 సంవత్సరాల పిల్లల తల్లులకు ప్రీస్కూల్ కార్యక్రమాల గురించి, ఈవెంట్స్ గురించి అవగాహన కల్పించారు. ఐదు నెలల గర్భిణీలకు సీమంతాలు, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించే ప్రీ స్కూల్ కార్యక్రమాలకు హాజరు కావాలని సూచించారు. ప్రతి సంవత్సరం జూలై, డిసెంబరు, ఏప్రిల్ నెలల్లో పిల్లల శారీరక, మేధో వికాసం, భాష నేర్చుకునే రీతులు, బడికి సంసిద్ధత వంటి అభివృద్ధి అంశాలపై తల్లులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, సుజాత, బుజ్జమ్మ, అనురాధ, మ్యాకల దివ్య, మ్యాకల అన్నపూర్ణ, ఆయాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 4: ప్రతి ఒక్కరూ తమ పాడి గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యశాఖ అధికారులు సూచించారు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని రఘురాములకోట గ్రామంలో 184గేదెలకు, 12 ఆవులకు ఉచితంగా గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులలో గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైందన్నారు. ప్రతి రైతు టీకాలు వేయించి పశువులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్, సబార్డినేట్‌లు రాజు, గంగయ్య, వెంకటయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

● ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్


సైబర్ వారియర్స్‌తో జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4 : సైబర్ నేరాలను త్వరితగతిన పరిష్కరించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జగిత్యాల జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కు ఫోన్లు, సిమ్ కార్డులను ఎస్పీ అందజేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో సైబర్ నేరాలపై ప్రత్యేక శిక్షణ పొందిన సైబర్ వారియర్స్‌ను నియమించడం జరిగిందన్నారు. సైబర్ వారియర్స్ ప్రత్యేకంగా సైబర్ నేరాల కట్టడిపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 18 మంది సైబర్ వారియర్స్‌కు ప్రత్యేక ఫోన్లను అందించి సిమ్ కార్డులను ఇచ్చామన్నారు. సైబర్ నేరాల బాధితులు తక్షణమే నేరాలకు గురైతే 1930 లేదా సైబర్ వారియర్స్‌కు కేటాయించిన ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు ఏమాత్రం ఆందోళనకు గురికాకుండా సంఘటన చోటుచేసుకున్న తర్వాత వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం జిల్లాలోని 18 పోలీస్ స్టేషన్లకు సంబంధించిన సైబర్ వారియర్స్ ఫోన్ నెంబర్స్‌ను ఎస్పీ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం డీఎస్పీ రంగారెడ్డి తదితరులు ఉన్నారు.







పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: ఆర్థిక ఇబ్బందులు తాళలేక భవన నిర్మాణ కార్మికుడు సిరిపురం ముత్తయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని ముత్తయ్య భవన నిర్మాణ కార్మికుడిగా కొనసాగుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యేడాది కిందట కొడుకు శ్రీనివాస్‌ను రూ.2లక్షలు అప్పులు బహ్రెయిన్ దేశానికి పంపించాడు. మరో రూ.2 లక్షలు బాకీలు చేసి ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. కూలీ పనులు చేసిన కుటుంబ పోషణ భారంగా మారింది. చేతిలో డబ్బులు లేకపోవడం వల్ల ఇంటి నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయింది. ఓ వైపు అప్పులు.. మరో వైపు కుటుంబాన్ని పోషించే మార్గం కానరాక మనస్థాపం చెందిన ముత్తయ్య పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు పట్టివేత

ఎండపల్లి, ఏప్రిల్ 4; మండలంలోని పాతగూడూర్‌లోని దస్తగిరి గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో జగిత్యాల మైనింగ్ అధికారులు రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ని పట్టుకు న్నారు. మైనింగ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మాకు వచ్చిన పక్కా సమాచా రంతో పాతగూడూర్ దస్తగిరి గుట్టకు వెళ్లగా అక్కడ రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తుం డగా పట్టుకుని వాటికి సుమారుగా 4 వేలు జరిమానా విధించినట్టు మైనింగ్ అధికారులు తెలిపారు. మండలంలో అక్రమ మట్టి రవాణా చేస్తే వాహనాలను పట్టుకొని చట్టపర మైన చర్యలు తీసుకుంటామని ఎంతటి వారినైనా వదలమని మైనింగ్ అధికారులు తెలిపారు.

ఉపాధిహామీ కూలీలపై తేనెటీగల దాడి

- 12 మందికి గాయాలు

రామడుగు, ఏప్రిల్ 4: మండలంలోని వెదిర గ్రామంలో ఉపాధిహామీ కూలీలపై తేనేటీగలు గురువారం దాడి చేశాయి. పనులు చేపట్టేందుకు వెళ్లిన కూలీలపై దాడి చేయగా 12 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడడంతో సాయంత్రం 12 మందిని ఇంటికి తరలించారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

జమ్మికుంట, ఏప్రిల్ 4: జమ్మికుంట-ఉప్పల్ రైల్వే స్టేషన్ల మధ్య ఓ యువకుడు పాట్నా ఎక్స్‌ప్రెస్ రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి గురువారం మృతి చెందాడు. ఝూర్ఖాండ్ రాష్ట్రం ఛత్ర జిల్లా కోటప్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ (18) అనే యువకుడు హైదరాబాద్‌లో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి స్వగ్రామం వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో పాట్నా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. మార్గ మధ్యలో జమ్మికుంట-ఉప్పల్ స్టేషన్ల మధ్య రైల్లో నుంయి ప్రమాద వశాత్తు కింద పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

రూ.7,650 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 4: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,650 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 45మంది రైతులు 737క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,650, కనిష్ఠ ధర 5వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శుక్ర, శని, ఆది, సోమ, మంగళవారాలు మార్కెట్‌కు సెలవు దినాలు కాగా, తిరిగి బుధవారం పత్తి కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు మార్కెట్ కార్యదర్శి గూగులోతురెడ్డి నాయక్ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి


సైదాపూర్, ఏప్రిల్ 4: మండలంలోని సోమారం గ్రామ శివారులో పేకాడుతున్నారనే సమాచా రం మేరకు దాడి చేసినట్లు ఎస్సై జన్ను ఆరోగ్య తెలిపారు. గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి దాడి చేయగా ఏడుగురు పేకాడుతున్నారని చెప్పారు. ఇందులో నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, ముగ్గురు పారిపోయారని తెలిపారు. వారి నుంచి 3,100 రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు

వీణవంక, ఏప్రిల్ 4: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు పీర్ల రఘు, అశాడపు వినయ్‌ల పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వినయ్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలమని, పీర్ల రఘు పరారిలో ఉన్నారని తెలిపారు.







రెండో విడత జేఈఈ మెయిన్స్ ప్రారంభం



ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలోనికి వెళుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఏప్రిల్4: రెండో విడత జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ మెయిన్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసింది. గురువారం ప్రారంభమైనా ఈ పరీక్షలు ఏప్రిల్ 5,6,8,9,12వ తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులను రెండు గంటల ముందు నుంచే కేంద్రంలోనికి అనుమతించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షిఫ్టులలో ఈ పరీక్షలు నిర్వహిం చనున్నారు. మొదటి రోజు గురువారం జిల్లా వ్యాప్తంగా కేవలం మండల కేంద్రలోని ఐయాన్ డిజిటల్ జోన్ ఒక్క పరీక్ష కేంద్రాంలోనే నిర్వహించారు. మొదటి షిఫ్టులో 676 మంది విద్యా ర్థులకు 598 మంది హాజరయ్యారు. రెండో షిఫ్టులో 676 మందికి 610మంది హాజరయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలితకుమారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శంకరపట్నం, ఏప్రిల్ 4: శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్ ఎదురుగా కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీ కొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామానికి చెందిన సిరిసిల్ల ఆంజనేయులు (34) వ్యవసాయ కూలీ, హార్వేస్టర్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం గ్రామంలో సామూహిక పోచమ్మ బోనాలు ఉన్నందున ఫంక్షన్‌కు వెళ్లవద్దని తల్లి, భార్య చెప్పినా వినకుండా అతడి మేనల్లుడు మంద హరీష్‌ను వెంటబెట్టుకొని హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్‌కు వెళ్లారు. ఫంక్షన్ ముగించుకొని సింగాపూర్ నుంచి చింతగుట్టకు వస్తుండగా కేశవపట్నం బస్టాండ్ ఎదురుగా కరీంనగర్-వరంగల్ రహదారిపై కరీంనగర్ వైపు నుంచి వరంగల్ వెళ్తున్న సిరిసిల్ల డిపో బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న హరీష్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడికి తల్లి బుచ్చమ్మ, భార్య పూజ, ఇద్దరు కుమారులు సాయిగణేష్, సాత్విక్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఎన్నికల భత్యాలలో ఏకరూపత పాటించాలి



కలెక్టరేట్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల భత్యాలలో ఏకరూపత పాటించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయ ఏఓకు హన్మంత్ రెడ్డికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ హన్మంత్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి అత్యావసరాలు గల ఉద్యోగ, ఉపాధ్యాయులను మినహాయిం చాలని కోరారు. చిన్న పిల్లలు గల తల్లులు, దివ్యాంగులను, పదవీ విరమణకు దగ్గరగా ఉన్న వారిని మినహాయించాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయి వసతి కల్పించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఒక్కో రీతిగా ఎన్నికల భత్యాల పంపిణీ చేశారని, అతి తక్కువగా కోరుట్ల నియోజకవర్గంలో చెల్లించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపల్లి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడకు చేరుకున్న సైకిల్ యాత్ర

వేములవాడ, ఏప్రిల్ 4: ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం వేములవాడకు చేరుకుంది. రాజు ఐదు రోజులుగా సైకిల్ యాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయానికి చేరుకోగా ఆర్డీవో కార్యాలయ పాలనాధికారి గణేష్ సైకిల్ యాత్రకు సంఘీభావం తెలిపారు.

అక్రమంగా మద్యం, డబ్బు తరలించొద్దు

వీర్నపల్లి, ఏప్రిల్ 4 : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, డబ్బు రవాణా చేయొద్దని ఎస్‌ఐ రమేష్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ప్రజలందరూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు.



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నం దున ఎన్నికల నియమాలను పాటించాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ రాజిరెడ్డి, కానిస్టేబుళ్లు ప్రశాంత్, పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న ఒకరి అరెస్టు

ముస్తాబాద్, ఏప్రిల్ 4: ద్విచక్ర వాహనాల దొంగను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. చిన్నకోడూర్ మండలం జక్కపూర్ గ్రామానికి చెందిన మంతూరి మహేష్ గతంలో ముస్తాబాద్‌లో విశాలాక్షి మెస్ వద్ద బైక్, మాతృశ్రీ గార్డెన్ నుంచి బైక్ వేములవాడ తిప్పాపూర్ నుంచి స్కూటీ దొంగతనం చేశాడు. సీసీటీవీ సహాయంతో నిందితుడి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూరుకు చెందిన గుండవెని నారాయణ, బురుజుకింది ప్రవీణ్ గౌడ్ అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులుకేసు నమోదు చేశారు.

గుడుంబా తయారీ కేసులో ఒకరి రిమాండ్

ముస్తాబాద్, ఏప్రిల్ 4 : ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓ మహిళా గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డ కేసులో రిమాండ్‌కు పంపినట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ మిట్టపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెపు రాధిక గుడుంబా అమ్ముతూ గతంలో పట్టుబడింది. స్థానిక తహసీల్దార్ ఎదుట ఒక సంవత్సరానికి లక్ష రూపాలయ పూచికత్తుపై బైండోవర్ చేశారు. మళ్లీ గుడుంబా విక్రయిస్తూ దొరకడంతో నోటీసు అందించారు. డబ్బులు కట్టకపోగా తిరిగి గుడుంబా విక్రయిస్తుండడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు రాధికను రిమాండ్‌కు పంపినట్లు సీఐ మిట్టపల్లి శ్రీనివాస్ తెలిపారు.

ట్రాలీ ఆటో ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో ఓ ద్విచక్రవాహనదారుడిని ట్రాలీ ఆటో గురువారం ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. జవహర్ నగర్‌కు చెందిన మార్క సది అనే ద్విచక్రవాహనాదారుడిని వెనుకనుంచి ట్రాలీ ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు తప్పిన నీటి గండం

- కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి జోక్యంతో నీటి సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం
- ఎల్లంపల్లి డెడ్ స్టోరేజీ నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా సరఫరా



ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రాజెక్టు

కోల్‌సిటీ, ఏప్రిల్ 4: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్)కు నీటి గండం తప్పింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో సరిపడా నిల్వలు లేవని, ఏప్రిల్‌లో ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు నీటి సరఫరా చేయలేమని ఇరిగేషన్‌శాఖ పేర్కొనడంతో ఆర్‌ఎఫ్‌సీఎల్ వర్గాలు ఆందోళనకు గురయ్యాయి. ఏప్రిల్, మే నెలలో యూరియా ఉత్పత్తి జరిగితేనే రాబోయే వర్షాకాల సీజన్‌లో రైతాంగానికి యూరియా సరఫరాకు అవకాశం ఉంటుంది. పరిశ్రమకు ఎల్లంపల్లి నుంచి నీటి సరఫరా నిలిచిపోతే యూరియా ఉత్పత్తికి ఆటంకం కలుగనున్నది. ఈ పరిస్థితుల్లో ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ఎరువుల మంత్రిత్వశాఖ కార్యదర్శి రాష్ట్రప్రభుత్వ ప్రధనా కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ సీఈవో కూడా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ మేరకు లేఖ రాశారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటాదారుగా ఉంది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి అయ్యే యూరియాలో సగం తెలంగాణకే సరఫరా చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్‌ఎఫ్‌సీఎల్ కీలకంగా మారింది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా నీటి సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో 138మీటర్లకు దిగువన నీరు ఉంటే సరఫరా జరిగే అవకాశం ఉండదు. కేవలం మంచినీటి అవసరాలు, ఎన్‌టీపీసీ విద్యుత్ ఉత్పత్తి అవసరాలకే వినియోగించే అవకాశం ఉంది. 134 నుంచి 138మీటర్ల మధ్య డెడ్ స్టోరేజీలో ఎల్లంపల్లిలో 2.35టీఎంసీల నీటి నిల్వలుంటాయి. ఈ నీటిని వినియోగించుకుని ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉత్పత్తికి ఆటంకం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం మిషన్ భగీరథ స్కీమ్ నుంచి రోజుకు 18 క్యూసెక్కుల నీటిని ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరిన ప్రత్యేకంగా సబ్ మెర్సిబుల్ మోటార్లు బిగించి హైదరాబాద్ మెట్రో పాలిటిన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ద్వారా నీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు హెచ్‌ఎండబ్ల్యూఎస్ అంగీకారం కూడా తెలిపింది. బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ సీ సుదర్శన్‌రెడ్డి ఈ మేరకు గురువారం మున్సిపల్‌శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీకి లేఖ రాశారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు రోజూ 18క్యూసెక్కుల నీటి సరఫరా బాధ్యత తాము తీసుకుంటామని లేఖలో పేర్కొన్నారు. హైదరాబాద్ అవసరాలకు రోజూ 330క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 58క్యూసెక్కులు, ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు 18క్యూసెక్కులు కలిసి రోజూ 406క్యూసెక్కులు నీటి సరఫరా చేయాల్సి ఉంది. ప్రాజెక్టు నీటి మట్టం 138మీటర్లకు దిగువన పడిపోయిన సందర్భంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్‌తో పాటు ఆర్‌ఎఫ్‌సీఎల్ కూడా సబ్ మెర్సిబుల్ మోటార్ల బిగింపు కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నది.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వీ కర్ణన్

సిరిసిల్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నీటి సరఫరా చేయాలని వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాల ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, మిషన్‌భగీరథ, మున్సిపల్, మండల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు జిల్లాలో మంచి వ్యవస్థను, కంట్రోల్‌రూంను ఏర్పాటు చేసుకున్నారన్నారు. మిషన్‌భగీరథ ద్వారానే ఇంటింటికి తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా భవిష్యత్ కొరత ఏర్పడే అవకాశం ఉందని, స్థానికంగా ఉన్న ఇతర నీటి వనరులను వినియోగించుకోవాలని అన్నారు. ప్రస్తుతం మిషన్‌భగీరథ మెయిన్ పైప్‌లైన్ ద్వారా గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ వద్దకు ముందుగా నీరు చేరుకునే విధంగా చూడాలన్నారు. మిషన్‌భగీరథలో సాంకేతిక సిబ్బంది ఇంజనీర్లు, షిఫ్టుల వారీగా 24 గంటలు పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరా సజావుగా జరిగేందుకు ప్రత్యేక అభివృద్ధినిధుల కింద చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా పర్యవేక్షణకు కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ప్రతీ రోజు ఇంటింటికి నీటి సరఫరా వాస్తవిక వివరాలు అందించాలని అన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ ఇంటికి నీటి సరఫరా చేసేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో, వేములవాడ, సిరిసిల్ల, మున్సిపాలిటీల్లో ఉన్న బోరు బావులు, అవసరమైన మరమ్మతు చేశామని తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో రూ.2.49 కోట్లతో 136 పనుల్లో 60 పనులు పూర్తి చేశామని, 75 పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. నీటిసరఫరాకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే 9398684240కు సంప్రదించాలని సూచించారు. అనంతరం అగ్రహారం మిషన్‌భగీరథ ప్లాంట్‌ను పరిశీలించారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఉమారాణి, డీపీవో వీరబుచ్చయ్య, మిషన్‌భగీరథ ఈఈలు జానకి, విజయ్, భూగర్భ జలశాఖ అధికారి నర్సింహులు, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, టీపీవో అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

సైదాపూర్, ఏప్రిల్ 4: సైదాపూర్ మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన తూటి లక్ష్మిపతి(42) అనే వ్యక్తి అనారోగ్యం భరించలేక చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మిపతి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కళ్లు కనపడడం లేదు. ఆర్థిక ఇబ్బందులతో కళ్ల ఆపరేషన్ చేపించుకోవడానికి డబ్బులు లేక మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. రాత్రి వరకు తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు రాత్రంతా గాలించారు. గురువారం ఉదయం గొడిశాల శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు అటు వైపు వెళ్తున్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై జన్ను ఆరోగ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్‌నగర్‌లో గొడవ..

- కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 4: కరీంనగర్ అంబేద్కర్‌నగర్‌లో గురువారం సాయంత్రం గొడవ జరగగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని మూడో టాణా సీఐ జాన్‌రెడ్డి తెలి పారు. తల్హా అనే వ్యక్తిని ఇమ్రాన్ సుఫియన్, సుబన్, మరికొంత మంది కొట్టారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి మృతి



హరికృష్ణ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: పరీక్షలు ముగియడంతో సరదాగా ఈతకు వెళ్లిన పదో తరగతి విద్యార్థి గొల్లెం హరికృష్ణ(15)ను చెరువులో మునిగి మృతి చెందాడు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని రంగ చెరువు వద్ద గురువారం చోటు చేసుకుంది. అటు అల్మాస్‌పూర్, ఇటు విద్యార్థి స్వగ్రామమైన వీర్నపల్లి మండలం కంచర్లలో విషాదం నింపింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామానికి హరికృష్ణ వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివి ఇటీవల పరీక్షలు రాశాడు. పరీక్షలు ముగియడంతో తన మిత్రుడు కొమిరె రాకేశ్‌తో కలిసి అల్మాస్‌పూర్ శివారులోని రంగ చెరువు వద్ద ఉన్న తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లారు. ఈత కోసం హరికృష్ణ నీటిలోకి దిగాడు. ఈత రాకపోవడంతో నీట మునిగిపోయాడు. గట్టు పైనున్న రాకేశ్ భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశాడు. కొంత దూరంలో ఉన్న గొర్రెల కాపారికి విషయం చెప్పాడు. దీంతో ఇద్దరు కలిసి చెరువు వద్దకు వచ్చే లోపే హరికృష్ణ నీట మునిగి చనిపోయాడు. పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఎస్‌ఐలు రమాకాంత్, రమేశ్ స్థానికులు, యువకుల సహాయంతో శవాన్ని వెలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. హరికృష్ణ తండ్రి వెంకటి రెండు నెలల కిందట పెద్ద కొడుకు రాజుకు మార్‌తో కలిసి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు.

ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట: చెరువు సమీపంలో భారీ కందకాలు తీసి నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల ఈతకు వెళ్లిన పదో తరగతి విద్యార్థి గొల్లెం హరికృష్ణ మృతికి సంబంధించి ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి చిదుగు గోవర్ధన్‌గౌడ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని రంగ చెరువు ప్రాంతంలో ఈతకు వెళ్లి వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలోని పదో తరగతి విద్యార్థి హరికృష్ణ నీట మునిగి చనిపోయాడని పేర్కొన్నారు. చెరువు సమీపంలో చిదుగు గోవర్ధన్‌గౌడ్ భూమిని కొనుగోలు చేసి చుట్టు తీసిన కందకాల్లో నిలిచిన నీటిలో ఈత కోసం ప్రయత్నించగా తన కొడుకు మృతి చెందాడని బాధితురాలు లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

- కందకం వల్లే..

అల్మాస్‌పూర్ శివారులోని రంగ చెరువు సమీపంలో బొప్పాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి భూమిని కొనుగోలు చేసి చెరువు చుట్టూ భారీ కందకాలు తీసి నిర్లక్ష్యంగా వదిలేయడంతోనే విద్యార్థి హరికృష్ణ ప్రాణాలు పోయాయని కుటుంబ సభ్యులు, అల్మాస్‌పూర్, కంచర్ల గ్రామస్థులు ఆరోపించారు. గతంలో రైతులు ఆందోళన చేపట్టిన సదరు వ్యక్తి పట్టించుకోలేదని పేర్కొంటు న్నారు. చెరువు చుట్టు భారీ కందకాలు తీయడంపై అధికారులు స్పందిస్తే తమ కొడుకు ప్రాణాలు దక్కేవని తల్లి లక్ష్మీ, కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. కందకాలు తీసి నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల తమ కొడుకు మృతికి కారణమైన సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేపలు పట్టడంలో వివాదం.. వ్యక్తిపై కత్తితో దాడి

జ్యోతినగర్, ఏప్రిల్ 4: ఎల్కలపల్లి చింతల చెరువులో చేపలు పట్టే విషయంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదం ఒక వ్యక్తి కత్తిపోట్లకు దారి తీసింది. ఎన్టీపీసీ ఎస్‌ఐ టి ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్కలపల్లి చింతల చెరువులో చేపలు పట్టే విషయంలో కొన్ని రోజులుగా రెండు వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తమ మధ్య ఉన్న వివాదం సమసిపోవాలంటే తమకు అడ్డంగా ఉన్న చిట్టబోయిన చందును చంపాలని దాసరి భిక్షపతి, లింగాల సారయ్య, దాసరి లక్ష్మీనారాయణ పథకం వేశారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పొలం పనులకు వెళ్తున్న చందును అడ్డుకున్నారు. దాసరి భిక్షపతి, లింగాల సారయ్య చందును పట్టుకోగా, దాసరి లక్ష్మీనారాయణ కత్తితో పొడిచి ముగ్గురు పారిపోయారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న చందును స్థానికులు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి అన్న కొడుకు ఫిర్యాదు మేరకు దాసరి భిక్షపతి, సారయ్య, లక్ష్మీనారాయణలపై కేసు నమోదు చేశామని తెలిపారు. పరారీలో ఉన్న నిందితులను గురువారం కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎండపల్లి, ఏప్రిల్ 4: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో వెల్గటూర్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం పోలీసులు రాజారాంపల్లిలో పెట్రోలింగ్ చేస్తుండగా ఎనమిది ట్రాక్టర్లలో ఇసుక నింపుకొని వస్తుండగా రాజారాంపల్లి వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అనుమతులు లేకపోవడంతో అక్రమంగా తరలిస్తున్నారని వాటిని పట్టుకుని ఎస్‌ఐ ఉమాసాగర్ కేసు నమోదు చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 4: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరు వాహనదారులకు కరీంనగర్ కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడిన 10 మంది వాహనదారులను గురువారం కరీంనగర్ మున్సిఫ్‌కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఇందులో ఒకరికి 10 రోజులు, మరొకరికి 3 రోజుల జైలుశిక్షతోపాటు ఇద్దరికి కలిపి 3 వేల జరిమానా విధించారని తెలిపారు. మిగగా 8 మంది వాహనదారులకు 11 వేల రూపాయల జరిమానాను విధించినట్లు సీఐ తెలిపారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన



బహుమతులు అందుకున్న విద్యార్థులు

జగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలకు చెందిన చైతన్య టెక్నో పాఠశాల 8వ, 9వ తరగతి విద్యార్థులు ఇటీవల బంగారు పతకాలు సాధించడంతో గురువారం పలువురు అభినందించారు. నేపాల్ దేశంలోని పొకార పట్టణంలో గల రంగసాలా స్టేడియంలో ఇటీవల నిర్వహించిన థర్డ్ సౌత్ ఏషియా ఇంటర్ నేషనల్ రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ టి సచిన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలలో కూడా మేటిగా ఉండడం గర్వకారణమన్నారు. కాగా పాఠశాలకు చెందిన సాయి వరుణ్, దన్నపునేని సహర్ష్, హిమోక్షన్, అయాన్ పాషా, కీర్తి వర్ధన్, హర్షిత్, వృద్విన్, మోక్షిత్, రోహిత్, విజితేంద్ర, లక్ష్మీ ప్రణవ్ జూనియర్ (అండర్ 16) ఇండియా టీమ్ తరఫున ఆడి గెలుపొందారు. పాఠశాల కోచ్ ఇందిరాల వంశీ కిషోర్, పీఈటీ కొమ్మురాజుల అజయ్ కుమార్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో చైతన్య పాఠశాల ఏజీఎం రాజు, అకాడమిక్ కోఆర్డినేటర్ శివకోటేశ్వర్ రావు, డీన్ బిదారి శ్రీనివాస్, బ్యాచ్ ఇన్‌చార్జీ వంశీ కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడుగంటుతున్న రిజర్వాయర్లు

- రోజరోజుకు తగ్గుతున్న నీటి మట్టాలు
- వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు



నీటి నిల్వలు తగ్గిన ఎల్‌ఎండీ

తిమ్మాపూర్, ఏప్రిల్ 4: ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. దీంతో రిజర్వాయర్లలో నీటి మట్టాలు రోజు రోజుకు తగ్గుతున్నాయి. భూగర్భ జాలలు కూడా ఎప్పుడు లేనంతగా పడిపోతున్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్లకు ఎగువ నుంచి నీరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఉన్న నీటిని పొదుపుగా వాడుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

● ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారిగా ఆర్వీ కర్ణన్

వేసవి నెలల్లో తాగు నీటి ఇబ్బందులను అదిగమించేందుకు ప్రభుత్వం ప్రతేక అధికారులను నియమించింది. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు కలిపి వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ యాసంగిలో ఎల్‌ఎండీ నుంచి దిగువకు 28.5 టీఎంసీల నీటిని విడుదల చేశారు. మిడ్ మానేరు నుంచి ఎల్‌ఎండీలోకి 15 టీఎంసీలు వచ్చాయి. ఎల్‌ఎండీలో ప్రస్తుతం 5.231 టిఎంసిలు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి 1.24 టీఎంసీల నీరు మరో రెండు, మూడు రోజులలో ఎల్‌ఎండీలోకి రానున్నాయి. దీంతో ఎల్‌ఎండీ నీటిమట్టం 6.5 టీఎంసీలకు చేరుతుం ది. ఈ నీటిని జూలై 31 వరకు తాగునీటి కోసం ఉపయోగిస్తారు.

తాగు నీటికి ఇబ్బంది లేదు..



ప్రభుత్వ అదేశాల ప్రకారం వేసవి కాలంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గినా, జూలై 31 వరకు తాగు నీటికి ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఈ యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరాం. రైతులు సహకరించారు. ప్రస్తుతం వేసవి పూర్తయ్యే వరకు తాగు నీటి అవసరాలకే ప్రాధాన్యమిస్తాం.

- బి శంకర్, ఈఎన్సీ

రిజర్వాయర్లలో నీటిమట్టాలు

జలాశయం	నీటి సామర్థ్యం	ప్రస్తుత నీటి నిల్వలు	గత సంవత్సరం నీటి నిల్వలు	డెడ్ స్టోరేజ్	మిషన్ భగీరథకు/అవిరిగా నీటిఖర్చు
దిగువ మానేరు	24.034 టీఎంసీ	5.231 టీఎంసీ	11.712 టీఎంసీ	2.1 టీఎంసీ	143 క్యూసెక్కులు/ 125క్యూసెక్కులు
ఎంఎంఆర్	27.50 టీఎంసీ	7.69 టీఎంసీ	20.14 టీఎంసీ	3.82 టీఎంసీ	40 క్యూసెక్కులు/ 90క్యూసెక్కులు
ఎస్సారెస్పీ	90.3 టీఎంసీ	12.64టీఎంసీ	25.462 టీఎంసీ	5.00 టీఎంసీ	231 క్యూసెక్కులు/ 314క్యూసెక్కులు

కాంగ్రెస్ జనజాతర సభకు తరలిరండి

కథలాపూర్, ఏప్రిల్ 4: ఈ నెల 6న తుక్కుగూడలో నిర్వహించనున్న జనజాతర సభకు భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో విడుదల చేసి పేదలకు వరాలు అందించబోతుందన్నారు. పది లక్షల మందితో ఏర్పాటు చేయనున్న సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సహాయం

రాయికల్, ఏప్రిల్ 4: మండలంలోని భూపతిపూర్ గ్రామంలో నిరుపేద యువతి వివాహానికి విజేత యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే అనుపథ యూత్, తాజా మాజీ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, యువకులు కూడా తమవంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. వీరికి యువతి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజేత యూత్ అధ్యక్షుడు సోమ రమేష్, సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, యూత్ సభ్యులు రఘునందన్, ఆనంద్, రమేష్ బాబు, ప్రసాద్, ప్రహ్లాద హరీష్, సంతోష్ గౌడ్, శేఖర్, సతీష్, నరేష్, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు పరామర్శ



సంజయ్‌కుమార్‌తో మాట్లాడుతున్న రమేష్‌బాబు, నాయకులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4 : జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తండ్రి సీనియర్ న్యాయవాది హన్మంతరావు ఇటీవల మృతి చెందారు. గురువారం సంజయ్ కుమార్‌ను వేములవాడ మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా పెదెల్లి ప్రకాష్



పెదెల్లి ప్రకాష్

కోరుట్ల, ఏప్రిల్ 4: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కోరుట్ల నియోజకవర్గ ఎన్నికల కో ఆర్డినేటర్‌గా టీపీసీసీ సెక్రటరీ పెద్దల్లి ప్రకాష్‌ను నియమిస్తూ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గురువారం ప్రకటించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రామగుండం ప్రాంతానికి చెందిన పెద్దెల్లి ప్రకాష్‌ను పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా నియమించడంపై కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థికి సన్మానం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4: మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన కుమ్మరిపల్లి కార్తీక్ నవోదయ సీట్ సాధించగా గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను అధిగమించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్, నాయకులు రమేష్, రామనుజం, వెంకటేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● కథలాపూర్: మండల కేంద్రంలోని మాస్టో పాఠశాలకు చెందిన రిక్కల హనీష అనే విద్యార్థినికి జవహర్ నవోదయలో సీటు లభించింది. ఆరవ తరగతిలో చేరడానికి నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచి సీటు సాధించిందుకు గురువారం కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్ విద్యార్థిని అభినందించారు.

భూషణరావుపేట పాఠశాలలో క్విజ్ పోటీలు

కథలాపూర్, ఏప్రిల్ 4: మండలంలోని భూషణరావుపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కథలాపూర్ స్కూల్ కాంప్లెక్స్ స్థాయి పరిధిలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి ఊట్‌పల్లి, ద్వితీయ బహుమతి పోసానిపేట, తృతీయ బహుమతి దుంపెట ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు గెలుపొందారు. విజేతలను ప్రోత్సహించడానికి జవిడి సంతోష్ రెడ్డి, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆనందరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అర్జున్, మండల నోడల్ అధికారి శ్రీనివాస్, హెచ్ఎం విష్ణు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం

కొడిమ్యాల, ఏప్రిల్ 4: బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగిన 67వ జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొన్న మండల కేంద్రానికి చెందిన ఎర్రోజు తక్షిల్ అనే క్రీడాకారుడు తెలంగాణ జట్టు తరుపున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకు గురువారం మండలంలోని సండ్రల్లపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఏనుగు ఆదిరెడ్డి శాలువా కప్పి సన్మానించారు. తక్షిల్ ప్రస్తుతం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 16 క్రికెట్ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్నాడు. భవిష్యత్తులో క్రికెట్ క్రీడల్లో ఉన్నతంగా ఎదగాలని పలువురు కోరారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా చంద్రశేఖర్



ఓరుగంటి చంద్రశేఖర్

ధర్మపురి, ఏప్రిల్ 4: ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన ఓరుగంటి చంద్రశేఖర్‌ను బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు చేవెళ్ల మహేందర్ ఆయనకు గురువారం నియామక లేఖను పంపించారు. చంద్రశేఖర్ ఏబీవీపీ, బీజేవైఎంలో పనిచేసి పార్టీ బలోపేతం కోసం కృషి చేశాడు. దీంతో రాష్ట్ర నాయకుల ద్వారా ఆయనకు ఈ పదవి లభించింది. తన నియామకం కోసం సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ ఇవ్వలేదని నిరసన

కొడిమ్యాల, ఏప్రిల్ 4: కాంగ్రెస్ పాలనలో మాదిగలకు ఎంపీ టికెట్ దక్కలేదని గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంద కృష్ణమాదిగ ఆదేశాలతో ఎమ్మార్పీఎస్ అఖిలపక్షం ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణలోని 17 సీట్లలో ఒక సీటు కూడా మాదిగలకు కేటాయించక పోవటం బాధాకరం అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాలల పార్టీగా మారి ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గె మాలలకు టికెట్లు ఇప్పించుకున్నాడన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాలల చేతిలో బందీ అయినాడన్నారు. మాదిగల జనాభా 75 శాతం ఉంటే ఒక టికెట్ కెటాయించలేదన్నారు. మాదిగల అణిచివేతకు గురిచేస్తున్న కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాంమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు సురుగు శ్రీనుజగన్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, నాయకులు స్వామి, ప్రభుదాస్, మహేష్, రమేష్, ఆనందం, సతీష్, అనిల్, రవి, మల్లేశం, నరేష్ ఉన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

కొడిమ్యాల, ఏప్రిల్ 4: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ నక్షత్రం సందర్భంగా గురువారం జగిత్యాల పట్టణానికి చెందిన బోనగిరి సెలెక్షన్ అధినేత బోనగిరి రమేష్‌ఉమాదేవి దంపతులు, కుమారుడు వంశీకృష్ణ భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారి నాగరాజు రమేష్, దాతలు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో ఊరు పోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఆలయానికి స్లాబ్ వేసిన సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం ఆలయ కమిటీ వారు గ్రామస్థులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు నర్సింహారెడ్డి, చంద్రమోహన్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

హామీలు ఇచ్చి అమలు చేయని బీజేపీ ప్రభుత్వం

● మోదీ పాలన అంతా అబద్ధాలమయం ● ఎమ్మెల్సీ, నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

రాయికల్, ఏప్రిల్ 4: విదేశాల్లోని నల్ల ధనం తీసుకువచ్చి పేదోడి అకౌంట్‌లోకి రూ.15 లక్షలు వేస్తానని ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయిందని ఎమ్మెల్సీ, నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్‌లోని శివాజీ గార్డెన్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచ్‌లు, కుల సంఘాల నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి జీవన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి యేటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి తప్పించుకున్నారని, కేంద్రంలోని మోదీ పాలన అంతా అబద్ధాలమయమని అన్నారు. రైతులు తాము పండించిన పంటలకు చట్టబద్ధత కల్పించాలని ఆందోళన నిర్వహిస్తే ఆ ఆందోళనను కేంద్ర సర్కార్ అణిచివేసిందే తప్ప రైతులకు న్యాయం చేయలేదన్నారు. రైతు వ్యతిరేక విధానాల వల్ల 750 మంది రైతులు చనిపోయారని గుర్తు చేశారు. రైతులకు రుణమాఫీ చేస్తే సోమరులవుతారని చెబుతూ బడా వ్యాపారులకు మాత్రం లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. యూపీఏ హయాంలో రైతులను రుణ విముక్తులను చేసేందుకు రూ.70 వేల కోట్ల నిధులను వెచ్చించామని తెలిపారు. మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించే పాలన ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించే పాలన సాగించిందన్నారు. దేశంలో సామాన్య ప్రజలు నిత్యావసర వస్తువుల ధరల వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని, ధరలను అదుపులో పెట్టడంలో కేంద్రం విఫలమైందని చెప్పారు. మేడిగడ్డ మరమ్మతుల కోసం ప్రాజెక్ట్‌లో ఉన్న నీటిని గోదావరికి వదిలే బదులు ఎత్తిపోతల రివర్స్ పంపింగ్‌తో ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు నీటిని మళ్లిస్తే ప్రాజెక్ట్ జలకళ సంతరించుకుండేదని అన్నారు. కేసీఆర్ తప్పిదంతోనే ప్రాజెక్ట్‌లో నీటి స్థాయి తగ్గిందని, దీనికి తోడు పంటలు ఎండాయని పర్యటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించి గెలిపిస్తే పేదల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు అండగా ఉండి పనిచేస్తామని తెలిపారు. కార్యకర్తలంతా కలిసికట్టుగా ఉండి కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ గెలుపు కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మ్యాకల అనురాధరమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, మండల అధ్యక్షుడు రవీందర్ రావు, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్ రెడ్డి, బాపురపు నర్సయ్య, నాయకులు గోపి మాధవి, ఎద్దండి దివాకర్, దాసరి గంగాధర్, మున్నా, షాకీర్, కడకుంట్ల నరేష్, బత్తిని భూమయ్య, రాకేష్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు

మల్లాపూర్, ఏప్రిల్4: రేషన్ షాపులు నిర్వహిస్తున్న డీలర్లు అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు మల్లాపూర్ తహసీల్దార్ వీర్‌సింగ్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని రేషన్ షాపులను తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 2711031 నంబర్ గల రేషన్ డీలర్ కళ్లెం లలిత నిర్వహిస్తున్న షాపులో 1.45క్వింటాళ్ల రేషన్ బియ్యం వ్యత్యాసం వచ్చినట్లు గుర్తించారు. రేషన్ బియ్యం వ్యత్యాసం ఉన్నందున 6ఏ కింద కళ్లెం లలితపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అట్రాసిటీ కేసులపై డీఎస్పీ విచారణ

మల్యాల, ఏప్రిల్ 4: మండలంలో ఇటీవల నమోదు అయిన రెండు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ గురువారం విచారణ చేపట్టారు. ఎంపీపీ అవిశ్వాస తీర్మానంపై చర్చించే సమయంలో కులం పేరుతో దూషించాడనే ఫిర్యాదుపై బల్వంతాపూర్ ఎంపీటీసీ సంగని రవిపై అట్రాసిటీ కేసు కాగా మరొకటి మల్యాలకు చెందిన యువకుడు ఓ యువతిని మోసగించిన సంఘటనలో నమోదైన కేసులపై క్షేత్రస్థాయిలో బాధితులతో పాటు సాక్షులను విచారించారు.

ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరించారు. డీఎస్పీ వెంట సీఐ నీలం రవి, ఎస్సై అబ్దుల్ రహీం తదితరులు ఉన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మెట్‌పల్లి/ మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్4 : మెట్‌పల్లి, మండలంలో గురువారం జరిగిన పలు వివాహ వేడుకల్లో నూతన వధూవరులను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆశీర్వదించారు. గురువారం పట్టణంలోని, వెల్లుల్ల గ్రామ శివారులోని పంక్షన్ హాల్లో జరిగిన వివాహ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేడుకల్లో నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం సీనియర్ నాయకులతో మాట్లాడి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా గ్రామంలో అమలు పరిచిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, తిరుమల గంగాధర్, గూడా శ్రీకాంత్‌రెడ్డి, కొంతమ్ రాజాం, పుండ్ర శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

భీమారంలో..

భీమారం:మండలంలోని పసునూర్ గ్రామంలో కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు పోతాని విజయ కూతురు వివాహానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కార్యకర్తలు, స్థానిక ప్రజలతో పలు అంశాలపై మాట్లాడారు. ఆయన వెంట భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, మేడిపల్లి మండల అధ్యక్షుడు ఏనుగు రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షులు తోకల నర్సయ్య, లచ్చానాయక్, సయ్యద్, జీవన్, చాంద్, నాగరాజు, వినోద్, జలందర్, స్వామి, పోచయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థుకు అవగాహన



విద్యార్థులకు నియమాక పత్రాలను అందజేస్తున్న ఏఎస్సై అంజనేయులు



అవగాహన కలిగిస్తున్న హెడ్ కానిస్టేబుల్

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 4: ప్రస్తుత కాలంలో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నందున విద్యార్థులు తమ తల్లిదండ్రులు, చుట్టూ ఉన్నవారికి సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించి చైతన్య పరచాలని ఏఎస్సై అంజేయులు అన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా అంబాసిడర్లుగా ఆన్‌లైన్‌లో శిక్షణ పొంది ఎంపికైనా మండలంలోని కోనరావుపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని ఆయోషా, మేఘన, ప్రియ, లిఖితలకు గురువారం ఆయన నియమాక పత్రాలను స్థానిక నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వాట్సాప్, పేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాలను విద్యార్థులు, ప్రజలు ఎక్కువగా వాడుతున్న సమయంలో సైబర్ మోసాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు 1930 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేసే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జక్కని పరంధాములు, అనిరెడ్డి మారుతిరెడ్డి, కాశీరాం, సత్యనారాయణ, ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, ఉపాధ్యాయులు విజేందర్‌రెడ్డి, శ్రీరాములు, జలందర్ పాల్గొన్నారు.

కొడిమ్యాలలో...

● కొడిమ్యాల : సైబర్ నేరాల బారిన ఎవరూ పడవద్దని కొడిమ్యాల హెడ్ కానిస్టేబుల్ సౌందర్య కోరారు. గురువారం మండలంలోని రాంసాగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.

తల్లిదండ్రులకు, గురువులకు, పాఠ శాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, కానిస్టేబుల్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు సహకారం అందించాలి

● కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



ఇఫ్తార్ విందులో కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

జగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):పేదలకు సహకారం అందించాలని, జన్మనిచ్చిన తల్లితండ్రుల పట్ల గౌరవంగా మెలగాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. ఐడీఓసిలో గురువారం ట్రెసా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు. పేదల ఆకలి తీర్చాలని, తమ స్తోమత ప్రకారం సేవ చేయాలని అన్నారు. భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం, సంస్కృతిని ఎప్పుడూ పాటిస్తూ సోదర భావాన్ని పెంపొందించాలని కోరారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓలు మధుసూదన్, శ్రీనివాస్, ట్రెసా అధ్యక్షుడు వకీల్, టీఎన్‌జీఓ అధ్యక్షుడు శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

● బీజేపీ కొడిమ్యాల మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

కొడిమ్యాల, ఏప్రిల్ 4: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల బీజేపీ నాయకులతో రైతు దీక్షను నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతులుఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రైతు పెట్టుబడి సహాయం, వరి పంటకు 500 రూపాయల బోనస్‌లాంటి హామీలను నెరవేర్చలేదన్నారు. పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గత ప్రభుత్వం మిల్లర్లతో కలిసి రైతులను మోసం చేసిందని ఆరోపించారు. అంతకముందు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. రైతుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుచ్చిరాములు, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, రాజేశం, రాంచందర్‌రావు, నర్సింహారెడ్డి, రాజు, నరేష్, శ్రీనివాస్, హరీష్, భూమేష్, రమణాచారి, వెంకట్‌రావు, బాబు, మహేందర్ తదితరులు ఉన్నారు.

50 రోజులకు చేరిన ఉచిత అల్పాహారం పంపిణీ



అల్పాహారం అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కోరుట్ల, ఏప్రిల్ 4: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320సీ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిర్వహిస్తున్న ఉచిత అల్పాహార పంపిణీ కార్యక్రమం గురువారం 50వ రోజుకు చేరుకుంది. ప్రతి రోజు సుమారు 150 మందికి అల్పాహారం అందించినట్లు క్లబ్ పట్టణ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్ తెలిపారు. కార్యక్రమ రిలీఫ్ టీం మెంబర్ ఎలిమిశ్ల ఉషాకిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అల్పాహారం ఏర్పాటుకు లయన్స్ క్లబ్ సభ్యులు సహకారం అందించారన్నారు. క్లబ్ సభ్యులు ఇల్లెందుల వెంకట రాములు, కుందారపు మహేందర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



మురికి కాలువను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4: ప్రత్యేక పాలనలో 'పడకేసిన పారిశుధ్యం' అనే కథనం ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో ఈ నెల 3న ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. ఇబ్రహీంపట్నం మేజర్ గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలన తీరుపై జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. గ్రామాల్లో మురికి కాలువలు కంపుకొడుతున్నా అధికారులు చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీంతో వెంటనే అధికారులు మండలంలోని అన్ని గ్రామాల్లో సానిటేషన్‌తో పాటు వివిధ పనులను చకచక చక్కబెట్టారు. ఇండెన్ గ్యాస్ ముందు నిండిపోయిన మురికి కాలువను పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించి సానిటేషన్, బ్లీచింగ్ పనులు చేపట్టారు. గ్యాస్ ముందర కంపు పోవడంతో వినియోగదారులు ఆంధ్రజ్యోతికి ధన్యావాదలు తెలిపారు.

ఇంటి పన్ను చెల్లించి రాయితీ పొందాలి

● మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లి, ఏప్రిల్4: మెట్‌పల్లి పురపాలక పరిధిలోని ప్రజలు సకాలంలో ఇంటి పన్ను చెల్లించి రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగా 2024-25 సంవత్సరానికి చెందిన ఇంటి పన్నును ఈనెల 30లోపు చెల్లించి మున్సిపల్ నుంచి కల్పిస్తున్న 5 శాతం రాయితీ పొందాలన్నారు. ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఇంటి పన్నును సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో స్నాతకోత్సవం



విద్యార్థుల స్నాతకోత్సవంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

కోరుట్ల, ఏప్రిల్ 4: పట్టణంలోని బాలాజీ రోడ్డులో గురువారం అంగన్‌వాడి కేంద్రంలో స్నాతకోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాలను నిర్వహించి వారి అభివృద్ధిని పరిశీలన జరిపి కిశోర బాలలకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ మెట్‌పల్లి ప్రాజెక్ట్ డైరెక్టర్ తిరుమల దేవి, సూపర్‌వైజర్ ప్రేమలత, శైని పాల్గొన్నారు.

● కోరుట్ల రూరల్ : మండలంలోని అయా గ్రామాలలో గురువారం అంగన్‌వాడీ వార్సికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రీస్కూల్‌లో చదివిన విద్యార్థులకు సర్టిపికెట్లను అందించి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్ శెనిలతో పాటు అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

రక్తదానం

భీమారం, ఏప్రిల్ 4: పురిటి నొప్పులు పడుతున్న మహిళకు అత్యవసరంగా రక్తం అవసరం ఉండటంతో రాగోజీపేట మాజీ సర్పంచ్ లహరిక మారుతిగౌడ్ రక్తదానం చేశారు. మహిళకు అత్యవసరంగా రక్తం అవసరముందని బక్కూరి ఫౌండేషన్ దృష్టికి రావటంతో వెంటనే స్పందించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వీరిని బక్కూరి ఫౌండేషన్ చైర్మన్ నరేష్ తదితరులు అభినందిస్తున్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవం



పోచమ్మతల్లి ఆలయం వద్ద ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, ఏప్రిల్ 4: మల్యాల కొత్తపేటలో నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మతల్లి ఆలయంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆల యంలోని నూతన విగ్రహాలకు మంద మర్రికి చెందిన ముస్త్యాల సంతోష్‌శర్మ, గ్రామ పురోహితులు కొత్తపల్లి ఉమామహేశ్వర్‌శర్మ, ప్రణీత్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై పూజలు నిర్వహించారు. జడ్పీటీసీ కొండపల్కుల రామ్మోహన్‌రావు, విండో చైర్మన్ రాంలింగారెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.